క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ బాలమణి



కార్పొరేటర్ బాలమణిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేతలు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 19వ డివిజన్ కార్పొరేటర్ బైగళ్ల బాలమణితో పాటు జిల్లెలగూడ వివేక్‌నగర్‌కు చెందిన యువకులు సోమవారం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు కార్పొరేటర్ బాలమణి, యువకులకు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, యువకులు చేరుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా తయారవుతోందని అన్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జిల్లెల నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దశరథ, కిరణ్, సందీప్‌రెడ్డి, రాహుల్, ఉదయ్, సాయిశంకర్, నవీన్, లావణ్య, కళమ్మ, ఎల్లమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

జాతీయవాద పార్టీని అధికారంలోకి తేవాలి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్

షాబాద్: జాతీయవాద పార్టీని కేంద్రంలో అధికారంలోకి తేవాల్సిన అవసరం ఉందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో భారతీయ కిసాన్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రసాదించిన సర్వహక్కులు రైతులకు కూడా వర్తిస్తాయన్నారు. రాజ్యాంగాన్ని వాడుకొని తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు రైతులు ఏకతాటిపైకి రావాల్సి ఉందని సూచించారు. రైతాంగం ప్రస్తుతం రెవెన్యూ, మార్కెటింగ్, విద్యుత్ సమస్యలతో వేగిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ సమస్యలను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం కొంత ప్రయత్నం చేసినా మళ్లీ వెనక్కి తగ్గడం విచారకరమన్నారు. వెనక్కి తీసుకున్న చట్టాలను పునరుద్ధరించి రైతాంగానికి మేలు చేకూర్చాల్సి ఉందన్నారు. కేంద్రంలో సుస్థిరమైన జాతీయవాద ప్రభుత్వం ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆత్మవిమర్శతో ఓటు చేయాల్సి ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండల కార్యవర్గ సభ్యుడు చంద్రబాబు, కేశవగూడ, నాగర్‌కుంట, బొబ్బిలిగామ, పోలారం, తాళ్లపల్లి, రేగడిదోస్వాడ, కేసారం, చర్లగూడ గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులున్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి చందనవెళ్లి గ్రామంలో ఉప్పల మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను నిర్వాహకుడు చేవెళ్ల స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బోనాల ఊరేగింపులో జోగిని శ్యామల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, నాయకులు బుచయ్య, రవికుమార్, మహేందర్‌గౌడ్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

మండల విద్యుత్ ఏఈ హామునాయక్

మొయినాబాద్: విద్యుత్ ప్రమాదాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల విద్యుత్ ఏఈ హామునాయక్ అన్నారు. మండల పరిధిలోని సురంగల్ రెవెన్యూలో ఆదివారం విద్యుత్ ప్రమాదంతో కనకమామిడికి చెందిన రైతు కంచె కృష్ణ మృతి చెందిన ప్రదేశాన్ని సోమవారం విద్యుత్ అధికారులు పరిశీలించారు. వ్యవసాయ బోర్ల వద్ద ఉండే స్టార్టర్ బాక్సుల నిర్వహణ రైతులదే అన్నారు. రైతు కృష్ణ జంతువుల నుంచి పంటను రక్షించుకోవడానికి జీఐ వైర్‌ను చేను చుట్టూ వేశారని.. దాని కారణంగానే రైతుకు ప్రమాదం జరిగి ఉండొచ్చని తెలిపారు. రైతులు పంటల రక్షణకు విద్యుత్‌ను వినియోగించొద్దన్నారు. అధికారులకు సమాచారం లేకుండా ఇలాంటి చర్యలకు పాల్పడొద్దని సూచించారు.

బీర్లు దొరకడం లేదు బాబోయ్!



ఓ వైన్ షాపు వద్ద బీర్లు నో స్టాక్ బోర్డు

- వైన్స్‌ల్లో దొరకని చల్లటి బీర్లు
- స్టాక్ వచ్చిన గంటల్లోనే ఖాళీ అవుతున్న దుకాణాలు
- వైన్స్‌ల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనం
- కొరత మరింత పెరిగే అవకాశం
- చర్యలు తీసుకుంటున్నామంటున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

మహేశ్వరం: వేసవికాలంలో చల్లటి బీరు తాగాలని ఆశించే మద్యం ప్రియులకు బీర్లు దొరకడం కష్టంగా మారుతోంది. ఇప్పటికే మహేశ్వరం, కందుకూరు మండలాల్లో ఉన్న వైన్స్‌లకు, మద్యం డిపోలకు బీర్ల సరఫరా చాలా వరకు నిలిచిపోయింది. వచ్చిన కొద్ది పాటి నిల్వలను ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న వైన్స్‌లకు రేషియో పద్ధతిన సరఫరా చేస్తోంది. మరికొన్ని రోజుల్లో బీర్ల కొరత తీవ్రం కానున్నట్లు తెలుస్తోంది. గతంలో పలు కంపెనీలు ప్రభుత్వ లిక్కర్ గోదాంలకు సరఫరా చేసిన బీరు నిల్వలకు బకాయిల చెల్లింపులో జాప్యమే కొరతకు కారణమని తెలుస్తోంది. మహేశ్వరం పరిధిలో మొత్తం 13 మద్యం దుకాణాలు, మూడుబార్లు ఉన్నాయి. వేసవిలో పెద్ద ఎత్తున బీర్ల అమ్మకాలు సాగుతున్నాయి. గత ఏడాది 2023 ఏప్రిల్ నెల వరకు 24 వేల బీరు కేసుల విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది 2024 ఏప్రిల్ నెల వరకు 30 వేల కేసుల బీర్ల విక్రయాలు జరిగాయి. మే నెలలో భారీగా విక్రయాలు జరుగుతాయని అంచన వేస్తున్నారు. గత ఏడాది బీరు కేసులు మద్యం దుకాణాల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేసే డిపోలే వేల కేసుల నిల్వలు ఉండేవి. ప్రస్తుతం బీరు కేసులు వచ్చినవి వచ్చినట్లుగా విక్రయిస్తుండగా డిపోలో నిల్వలు ఉండడం లేదు. ఈ లెక్కన డిమాండ్‌కు తగ్గ బీర్ల సరఫరా లేదు.

ఎండల ఎఫెక్ట్, పెళ్లిలే కారణం

మహేశ్వరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బీర్ల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. బీర్లు దొరకకపోవడంతో లిక్కర్ కొనుగోలు చేస్తున్నారు. బీర్ల కొరతకు ప్రధాన కారణం ఈ వేసవిలో పెళ్లిలు, విందులు, ఎండల తీవ్రత, ఆయా గ్రామాల్లో గ్రామ దేవతల పండుగలు, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ, బోనాల జాతర ఉండటంతో ఏప్రిల్ నెలలో ఉండడంతో ఎక్కువ మంది బీర్లను కొనుగోలు చేశారు. దీంతో కొరత ఏర్పడిందని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. ఎక్కువగా వైన్స్‌ల్లో కింగ్ ఫిషర్ లైట్, బడ్వయిజర్, కరోనా, గ్రీన్, రాయల్ చాలెంజర్ బీరు, ఇతర లైట్ బీర్ల కొరత తీవ్రంగా ఉంది.

పెండింగ్‌లో బిల్లులు

లిక్కర్ తయారీ కంపెనీల నుంచి ప్రభుత్వం వివిధ బ్రాండ్లకు సంబంధించిన బీర్లు కొనుగోలు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం డిపోలకు సరఫరా చేస్తోంది. అక్కడి నుంచి రిటైల్ దుకాణాలకు సరఫరా జరుగుతుంది. లిక్కర్ తయారీ కంపెనీలు సరఫరా చేసిన మద్యం బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కొన్ని డిస్టిలరీస్, బ్రేవరేజేస్ మద్యం ఉత్పత్తి తగ్గించడంతో పాటు బీరు నిల్వల సరఫరా తగ్గించేశాయి. వేసవిలో మార్చి నుంచి మే నెల వరకు దాదాపు కోట్ల రూపాయాల విలువైన బీర్ల అమ్మకాలు జరుగుతాయి.

అమ్మకాలు పెరిగాయి..

ఈ సారి ఏప్రిల్ నెలలోనే ఎండలు తీవ్రతంగా ఉండడం, పెళ్లిలు, పలు ఫంక్షన్ల కారణంగా బీర్ల అమ్మకాలు పెరిగాయి. దీంతో వైన్స్‌ల్లో కొరత ఏర్పడింది. గత సంవత్సరం కంటే ఈ ఏడాది ఎక్కువగా అమ్మకాలు జరిగాయి. వైన్స్‌ల్లో గ్రౌండ్ స్టాక్ నిల్వలు ఉండడం లేదు. ప్రతి రోజు వైన్స్‌ల నుంచి అమ్మకాల వివరాలు సేకరించి డిపోలకు అర్డర్ పెడుతున్నాం.

– తిరుపతిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, మహేశ్వరం



బైరాగిగూడలో ప్రచారం చేస్తున్న నాయకులు



బడంగ్‌పేట్: సుల్తాన్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం

కందుకూరు: కాంగ్రెస్ పాలనలోనే ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బైరాగిగూడలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే సంక్షేమాభివృద్ధి రిగిందని చెప్పారు. పదేళ్ల బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లోకేందర్‌రెడ్డి, శ్రీధర్‌ముదిరాజ్, పాండుగౌడ్, కుమార్, బాబురావు, మహేందర్, బాలమల్లేష్ యాదవ్, సుధాకర్, ప్రేమలమ్మ, వినోద, రవీందర్, శ్రీకాంత్, జంగమ్మ, విజయ, రాజు మల్లమ్మ, రాజేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే ఓటేయండి!

బడంగ్‌పేట్: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి కోరారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీల అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. విలువైన ఓటును హస్తం గుర్తుపై వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం

మహేశ్వరం: చేవెళ్లలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్, కూన యాదయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన సాధ్యమన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. బీజేపీకి ఓటేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తారన్నారు. బీజేపీతోనే రాజ్యాంగానికి ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘుపతి, మహేశ్వరం టౌన్ పార్టీ అధ్యక్షుడు లాజర్, శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల ప్రజలంతా కొండా వెంటే

విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

మహేశ్వరం: చేవెళ్ల ప్రజలంతా కొండా వెంటే ఉన్నారని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అమీర్‌పేట్, మాణిక్యమ్మగూడ, కేకే బస్తి, సుభాన్‌పూర్ గ్రామాల్లో ఆమె స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో మరోసారి నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ఘన విజయం సాధించబోతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలు చేవెళ్ల పార్లమెంట్ ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు.కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం ఉందని చెప్పారు. మే 13న బీజేపీకి ఓటు వేసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు గ్రామాల్లో రైతులు, మహిళలలు, యువకులు, ఉపాధి కూలీలతో ఆమె మాట్లాడి బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మాధవచారి, నాగారం, మాణిక్యమ్మగూడ ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్, అనితా నాయక్, మాణిక్యమ్మగూడ, అమీర్‌పేట్ గ్రామాల మాజీ సర్పంచ్‌లు చంద్రయ్యగౌడ్, బస్వ శ్రీశైలం గౌడ్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి

కందుకూరు: చేవెళ్లలో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ ఎంపీపీ మంద జ్యోతిపాండు పిలుపునిచ్చారు. సోమవారం కందుకూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో మరోమారు నరేంద్రమోదీ పాలన రావాలంటే బీజేపీకే ఓటు వేయాలన్నారు. దేశ సమైక్యత, పరిరక్షణకు పాటుపడే పార్టీ ఒక్క బీజేపీనేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నిమ్మ అంజిరెడ్డి, దేశం సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుభాన్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న సంగీతారెడ్డి, నాయకులు



సరస్వతిగూడలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



బడంగ్‌పేట్: ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి

కందుకూరు: బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సరస్వతిగూడ, అగర్‌మియాగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ముందు చూపుతో ప్రణాళికాబద్ధంగా ప్రాంతాల వారీగా అభివృద్ధి పనులు కొనసాగించారని అన్నారు. వాటి ఫలాలు ప్రస్తుతం ప్రజలకు అందుతున్నాయని చెప్పారు. కేంద్రంలో తెలంగాణ వాణిని వినిపించాలంటే ఒక్క బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తెలిపారు. చేవెళ్లలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను గెలి పించాలని విజ్ఞప్తి ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ గణేష్ నాయకులు దేవీలాల్, సంజీవరెడ్డి, కొండల్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

తుక్కుగూడ చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని కౌన్సిలర్ రవినాయక్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలోని 10వ వార్డులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలి

పహాడీషరీఫ్: పార్లమెంట్‌లో తెలంగాణ వాణి వినిపించాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసానిని గెలిపించాలని ఆ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ యూత్ వింగ్ అధ్యక్షుడు యంజాల అర్జున్ అన్నారు. మున్సిపాలిటీలోని 20వ వార్డులో సోమవారం ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్ ను గెలిపించాలని ఓటర్లను కోరారు.

కాసానిని గెలిపిద్దాం

బడంగ్‌పేట్: కారుకు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామని బీఆర్‌ఎస్ నాయకులు గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 30వ డివిజన్‌లోని ఎంసీఆర్, అరవబస్తీ, రోమా–2, తదితర కాలనీల్లో భీమిడి జంగారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డానియల్, బాబు, భీమా, బాబుల్‌రెడ్డి ఉన్నారు.

కాసానికే మద్దతు

అబద్ధాల హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నా కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సరూర్‌నగర్ బీఆర్‌ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఆకుల అరవింద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కాసానికి మద్దతుగా సరూర్‌నగర్ డివిజన్‌లో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. అరవింద్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకే తమ మద్దతని సీనియర్ సిటిజన్‌లు, పెన్షన్‌దారులు, ఉద్యోగులు అంటున్నారని చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత సబితకే దక్కిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాయమాటలకు మోసపోవద్దన్నారు. ప్రచారంలో నాయకులు ఇంటూరి అంకిరెడ్డి, లోకసాని కొండల్‌రెడ్డి, దర్పల్లి అశోక్, వార్డు కమిటీ సభ్యులు జహీర్‌భాయ్, కేశవరెడ్డి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న దోమలు

- షాద్‌నగర్‌లో కానరాని పారిశుద్ధ్య మెరుగు చర్యలు
- రక్తాన్ని పీల్చుతున్న దోమలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- రాత్రి నిద్రపట్టక అవస్థలు



శివరాం నాయక్ ఆస్పత్రి వద్ద మురుగు కాల్వ

షాద్‌నగర్: పట్టణంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. పగలు, రాత్రి అని లేకుండా స్వైర విహారం చేస్తూ.. ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ అంతంతమాత్రంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఇళ్ల తలుపులు కిటికీలు తెరిచి ఉంటే చాలు దర్జాగా ఇళ్లలోకి చేరి అడ్డంగా కుట్టి రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దీంతో రోగాల బారినపడి ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. కొద్దిరోజులుగా ఉధృతి ఎక్కువైనా అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో ప్రజలు దోమలతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో గాలి కోసం కిటికీలను తెరిచి ఉంచలేక.. ఆరు బయట పడుకోలేక అవస్థలు పడుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి దోమల నివారణ, డ్రైనేజీల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రబలుతున్న రోగాలు

ఒక్క దోమ వందల సంఖ్యలో దోమలను సృష్టిస్తుంది. దోమ కాటుతో వచ్చే రోగాలు కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకరంగా మారుతున్నాయి. ఇదివరకే చాలా మంది డెంగీ, మలేరియా వంటి రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

దోమలు విపరీతంగా వ్యాపించడానికి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పట్టణంలోని శివారుల కాలనీల్లో అంతర్గత మురుగు కాల్వల వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే నీరు రోడ్లపైనే పారుతోంది. అదేవిధంగా ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి కుంటలుగా తయారవుతున్నాయి. ఈ మురుగు కుంటలు దోమలకు మంచి స్థావరాలుగా మారాయి. అదేవిధంగా ఓపెన్ నాలాల కారణంగా దోమలు వస్తున్నాయి.

ఫాగింగ్ అంతంత మాత్రమే

దోమల నివారణకు మున్సిపల్ అధికారులు సరైన చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓపెన్ నాలాల్లో, మురుగు కుంటల వద్ద శానిటేషన్ అధికారులు దోమల నివారణ మందు పిచికారీ చేయాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆరోణలు వినిపిస్తున్నాయి. కాలనీల్లో నామమాత్రంగా ఫాగింగ్ చేస్తున్నారు. ప్రతి కాలనీల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


చర్యలు చేపట్టాలి



వేసవి కాలం ప్రారంభం కావడంతో దోమల బెడద అధికమైంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇళ్లలోకి విపరీతంగా వస్తున్నాయి. జనాల రక్తాన్ని పీలుస్తుండటంతో రోగాల బారిన పడుతున్నారు. వీటి నివారణకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– శ్రీశైలం, షాద్‌నగర్

ప్రజారోగ్యాన్ని కాపాడాలి



దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. మురుగు నీరు రోడ్లపై పారకుండా చర్యలు చేపట్టాలి. క్రమం తప్పకుండా కాలనీల్లో ఫాగింగ్ చేయాలి

– శివకుమార్, షాద్‌నగర్

రిజర్వేషన్లు రద్దుచేసే ప్రసక్తే లేదు

ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్

మొయినాబాద్‌రూరల్: దేశంలో బీజేపీ ప్రభుత్వం మోదీ వస్తే రిజర్వేషన్లు రద్దు అవుతాయని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలు సరికాదని రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాముడిపై ఓ సభలో అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలు ప్రజలకు ఎంతో ఇబ్బంది చేసేలా ఉన్నాయన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. దేశంలో మోదీతోనే న్యాయమైన పరిపాలన సాగుతుందని ఇప్పటికే ఇతర దేశాలు భారతదేశ పరిపాలనను చూసి అభినందించిన సంగతి కాంగ్రెస్ పార్టీ నాయకులు మరచిపోయారని పేర్కొన్నారు. న్యాయమైన పరిపాలన కోసం బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా నాయకులు చిలుకూరి గోపాల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి బంటు రాజమల్లేశ్, ఓబీసీ మండల అధ్యక్షుడు అశోక్‌యాదవ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, యువ మోర్చా అధ్యక్షుడు శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మండల ఉపాధ్యక్షుడు మహేందర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అంతంగారి చిట్టి, వినయ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9 నుంచి అష్టలక్ష్మి దేవాలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరప్రతాలను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయం 28వ బ్రహ్మోత్సవాలు ఈనెల 9 నుంచి 15 వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు అష్టలక్ష్మి దేవాలయ చైర్మన్ సోమ సురేష్ అన్నారు. సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధి చెందిన అష్టలక్ష్మి బ్రహ్మోత్సవాల కన్నుల పండుగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలలో భాగంగా తిరుచి పల్లకీ సేవ, శేష వాహన సేవ, హంస వాహన సేవ, సూర్యప్రభ వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, గజవాహనసేవ, హనుమత్ వాహన సేవ, గరుడ వాహన సేవ, అశ్వ వాహనసేవ, సింహ వాహనసేవ, కల్పవృక్ష వాహన సేవ, చిన్న రథోత్సవం, పెద్ద రథోత్సవం కార్యక్రమాలు భారీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386